శిథిలావస్థలో సామాజిక భవనం

- పనులు పూర్తి కాకుండానే ప్రారంభం
- గ్రామస్తులకు ఉపయోగపడని వైనం



పిచ్చి మొక్కల మధ్యలో సామాజిక భవనం

పెనమలూరు: గంగూరులో పేదల కోసం నిర్మించిన సామాజిక భవనం అతీగతీ లేక శిథిలమయింది. సామాజిక భవనం ఎవ్వరికీ పనికి రాకుండా నిరుపయోగంగా మారింది. సామాజిక భవనంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి. ఏపీ ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న కాలంలో 2013లో రాజ్యసభ ఎంపీ నిధులు, మండల పరిషత్ నిధులు దాదాపు రూ.20 లక్షలతో గంగూరులో పేదల కోసం కామన్‌సైట్‌లో సామాజిక భవనం నిర్మించారు. పంచాయతీ రాజ్‌శాఖ పర్యవేక్షణలో భవన నిర్మాణం చేశారు. రాష్ట్ర విడిపోయిన తరువాత టీడీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన సమయం 2014 సంవత్సరం డిసెంబర్ 14వ తేదీన మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే బోడెప్రసాద్ సామాజిక భవనాన్ని హడావుడిగా ప్రారంభించారు. వాస్తవానికి ఆ సమయంలో భవనం పనులు పూర్తి కాలేదు. విద్యుదీకరణ, కిటీకీలు, తలుపులు, మరుగు దొడ్లు, ప్రహరీ నిర్మాణం చేయలేదు. వీటికి నిధులు మంజూరు చేయలేదు. అవేమీ పట్టించుకోకుండా కాంగ్రెస్ హయాంలో నిర్మించిన సామాజిక భవనాన్ని టీడీపీ నేతలు ప్రారంభించి తమ ఖాతాలో వేసుకున్నారు.

తీరని గ్రామస్తుల అవసరాలు.....

గంగూరు గ్రామంలో దాదాపు 8 వేల మంది జనాభా ఇప్పుడు ఉన్నారు. ఈ గ్రామంలో దాదాపుగా అన్ని నిరుపేద, మధ్య తరగతి కుటంబాలే. పేద కుటుంబాల వారు శుభ కార్యక్రమాలు చేసుకోవాలంటే సామాజిక భవనం అవసరం చాలా ఉంది. పేదలు అధిక సొమ్ము ఖర్చు చేసి కల్యాణ మండపాల్లో శుభ కార్యక్రమాలు చేసుకుంటున్నారు. ఏ లక్ష్యంతో సామాజిక భవనం నిర్మించారో అది ప్రసుత్తం గ్రామస్తులకు అందుబాటులో లేదు. భవనం శిథిలమయ్యి , చెదలుపట్టి, పిచ్చిమొక్కల మధ్యలో నిరుపయోగంగా ఉంది. ఈ భవనం పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలంటే మరో రూ.10 లక్షలు నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేయాల్సి ఉంది. అభివృద్ధే ఊపిరని చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం సామాజిక భవనం అభివృద్ధిపై మాత్రం స్పందించటంలేదు.

ఇప్పటికైనా చర్యలు తీసుకోండి....

పేద, మధ్య తరగతి ప్రజల కోసం నిర్మించిన సామాజిక భవనం ప్రజల ఉపయోగార్థం అందుబాటులోకి తీసుకురావాలని గంగూరు గ్రామస్తులు కోరుతున్నారు. సామాజిక భవనం నిర్మించి దాదాపు 12 సంవత్సరాలు గడిచినా నేటికీ అందుబాటులో లేకుండా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆనాడు ఈ సమాజిక భవనం ప్రారంభించిన కూటమి నేతలే ప్రస్తుతం పదవుల్లో ఉన్నందున చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



చెదలు పట్టిన సామగ్రి

భవనం పనులు పూర్తిచేయాలి



సామాజిక భవనం పనులు ఇప్పటికై నా పూర్తి చేయాలి. భవనంలో అన్ని వసతులు కల్పించాలి. అన్ని వర్గాల వారికి సామాజిక భవనం ఉపయోగపడే విధంగా అధికారులు స్పందించాలి. సామజిక భవనం అందుబాటులోకి తీసుకు వస్తే పేద, మధ్య తరగతి కుటుంబాలకు న్యాయం జరుగుతుంది.

–కె.జోషి, గంగూరు

ముసుగు తొలగించరా ?



వైఎస్సార్ విగ్రహానికి తొలగించని ముసుగు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం గూడవల్లి ప్రధాన సెంటర్‌లోని మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ముసుగు తొలగించలేదు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో విగ్రహానికి ముసుగు వేశారు. అయితే ఎన్నికలు పూర్తయి, కోడ్ ముగిసినా ఇప్పటి వరకూ ముసుగు తొలగించకపోవడంతో పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ నాయకుల ఒత్తిడితోనే మహానేత విగ్రహానికి ముసుగు తొలగించలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికై నా విగ్రహానికి వేసిన ముసుగు తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి మద్దెల చింతలమ్మను వివరణ కోరగా వెంటనే ముసుగు తొలగించాలని సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు.

ఆశీలు పాట రూ.16.72 లక్షలు

ఉయ్యూరు: ఉయ్యూరు మార్కెట్ ఆశీలు పాట రూ.16.72 లక్షలు పలికింది. ఆశీల పాటకు నిర్వహించిన బహిరంగ వేలంలో అత్యధికంగా వేలంలో పాడి జంపాన జంగమయ్య దక్కించుకున్నారని మున్సిపల్ కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. ఏడాది పాటు పాటదారులు ఉయ్యూరు పట్టణంలో ఆశీలు వసూలు చేసుకునే హక్కు పొందారన్నారు.

క్లుప్తంగా

రంజాన్ తోఫా కిట్లు పంపిణీ



ఉయ్యూరు: రంజాన్ పర్వదినం సందర్భంగా వైఎస్సార్‌సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి ఆధ్వర్యంలో రంజాన్ తోఫా కిట్ల పంపిణీ చేపట్టారు. ఉయ్యూరు పట్టణంలో ఈ కిట్లను ముస్లింలకు గురువారం అందజేశారు. వైఎస్సార్ సీపీ ఉయ్యూరు పట్టణ అధ్యక్షుడు షేక్ అబు కలాం , మున్సిపల్ వైస్ చైర్మన్ సోలే సురేష్‌బాబు, కోఆప్షన్‌సభ్యుడు షేక్ ఖలీల్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గోన మదన్, ప్రభుత్వాసుపత్రి మాజీ చైర్మన్ జంపాన కొండలరావు, నాయకులు సలీంబేగ్, అబ్దుల్ సద్దాం, గఫూర్, అహ్మద్ ఖాన్, ఊర నాగిన్, ఏ.నాగబాబు, శివ, బాషా పాల్గొన్నారు.

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభం



పెనమలూరు: కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో గురువారం సివిల్ ఇంజనీరింగ్ విభాగం, అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ సంయుక్తంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభించారు. ఈ మేరకు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు వివరాలు తెలుపుతూ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌తో విద్యార్థులకు చాలా మేలు చేకూరుతుందని చెప్పారు. పరిశోధనలు, ఆవిష్కరణలు, పరిశ్రమలతో సమన్వయం, సాంకేతికంగా విద్యాభివృద్ధి చేయటం లక్ష్యంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ విభాగాధిపతి డాక్టర్ జగదీష్ వెంగల, అల్ట్రాటెక్ సిమెంట్ జోనల్ హెడ్ ఫ్రాన్సిస్ పి. జాన్, ఏరియా హెడ్ పి.విజేతకుమార్‌రెడ్డి, జి.సురేష్‌కుమార్, సివిల్ విభాగం కోఆర్డినేటర్ ఎం.దుర్గాప్రసన్న పాల్గొన్నారు.

ఈడుపుగల్లులో ఇఫ్తార్ విందు



కంకిపాడు: ఈడుపు గల్లు కొత్తూరు సెంటర్‌లోని మసీదులో ఇఫ్తార్ విందు కార్యక్రమం గురువారం రాత్రి జరిగింది. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షురాలు మాదు శ్రీహరి రాణి ఇఫ్తార్ విందు, ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కె.జోజ్ మేరీ, చౌరగుడి శ్రీకాంత్, షేక్ బాదుల్ల తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

పెనమలూరు: తాడిగడప మున్సిలిటీలో కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయు కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి కోరారు. ఈ మేరకు సమస్యలతో ఉన్న వినతిపత్రాన్ని గురువారం కమిషనర్ భవానిప్రసాద్‌కు అందచేశారు. కార్మికులకు రావాల్సిన హెల్త్ అలవెన్స్ రూ.6 వేలు ఏప్రిల్ నెల జీతాలతో ఇవ్వాలన్నారు. గతంలో చేసిన సమ్మెకు సంబంధించి సమ్మె కాలం జీతం కూడా చెల్లించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నేతలు షేక్.మస్తాన్‌వలి, నేతలు వై.సరళ, వెంకటరెడ్డి, దోమ ఇందిర, పి.దుర్గా పలువురు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం



గన్నవరం: కళాశాల ఫీజు కట్టలేని పరిస్థితుల్లో ఉన్న పేద కుటుంబానికి చెందిన విద్యార్థినికి మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అండగా నిలిచింది. ఈ మేరకు గురువారం కేసరపల్లి శివారు వెంకటనరసింహాపురం కాలనీకి చెందిన విద్యార్థిని కూర్మా పూర్ణహర్షితకు మానవతా సంస్థ ద్వారా రూ. 10 వేలు ఆర్థిక సాయం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు మదుపల్లి బాలకృష్ణమూర్తి మాట్లాడుతూ విజయవాడలో బీసీఏ డేటా సైన్స్ చదువుతున్న విద్యార్థిని కుటుంబ ఆర్థిక పరిస్థితులు కారణంగా కళాశాల ఫీజు కట్టలేకపోయిందన్నారు. ఈ విషయమై మానవతా స్వచ్ఛంద సంస్థను ఆమె కుటుంబ సభ్యులు సంప్రదించగా తమ వంతుగా ఆర్థిక తోడ్పాటు అందించినట్లు తెలిపారు. సంస్థ ప్రతినిధులు పువ్వుల ఆదినారాయణ, కర్రా వరప్రసాద్, రాధిక, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి

ఉయ్యూరు: పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం పన్ను వసూళ్లపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. మార్చి నెలాఖరు లోగా నూరు శాతం పన్ను వసూళ్లు పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం పన్ను వసూళ్ల బకాయిదారులకు ప్రత్యేక రాయితీ ఇచ్చిందన్నారు.

వణుకూరులో వైఎస్సార్ సీపీ విజయం



వణుకూరు ఉపసర్పంచ్‌గా గెలిచిన నాగరాజును అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

పెనమలూరు: వణుకూరు గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించింది. గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం జరిగిన ఉపసర్పంచ్ ఎన్నికల్లో 2వ వార్డు సభ్యుడు ఆరేపల్లి నాగరాజు నామినేషన్ పత్రాలు ఎన్నికల అధికారి బి.శ్రీనివాసరావుకు దాఖలు చేశారు. ఇతరులు ఎవ్వరు పోటీలో లేక పోవటంతో నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు ఎన్నికల అధికారి బి.శ్రీనివాసరావు ప్రకటించారు. వణుకూరు గ్రామ పంచాయతీలో 14 మంది వార్డు సభ్యులు ఉన్నారు. గతంలో ఉప సర్పంచ్‌గా ఉన్న గద్దల రాజా గతంలో జరిగిన ఒప్పందం ప్రకారం పదవికి రాజీనామా చేయటంతో ఉప సర్పంచి ఎన్నికలు జరిగాయి. కాగా వణుకూరు ఉపసర్పంచిగా ఎన్నికయిన ఆరేపల్లి నాగరాజుకు పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి అభినందనలు తెలిపారు. పార్టీ నాయకులు జగనన్న నాయకత్వంలో ఐక్యతతో పని చేయటం వలన విజయం సాధించామన్నారు. వార్డు సభ్యులు ఎటువంటి ఒత్తిళ్లకు లొంగకుండా నిజాయతీగా వ్యవహరించినందుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి విజయ, పార్టీ నేతలు గద్దల రాజా, చక్కాగోపి, వార్డు సభ్యులు, పలువురు నేతలు పాల్గొన్నారు.

రామవరప్పాడు ఉపసర్పంచ్ ఏకగ్రీవం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు గ్రామ ఉపసర్పంచ్ స్థానానికి గురువారం నిర్వహించిన ఎన్నిక ఏకగ్రీవమైంది. కూటమి బలపరిచిన అభ్యర్థి ఆరో వార్డు సభ్యుడు అద్దెపల్లి సాంబశివనాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఈవోఆర్డీ, ఎన్నికల అధికారి దుర్గా ప్రసాద్ ప్రకటించారు. పంచాయతీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ఉపసర్పంచ్ ఎన్నిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పంచాయతీలో మొత్తం 20 మంది వార్డు సభ్యులుండగా నలుగురు వార్డు సభ్యులు కత్తుల శ్రీనివాసరావు, అనిత, నారాయణ, మేకల నాగేశ్వరరావు గైర్హాజరయ్యారు. దీంతో సర్పంచ్ ఓటుతో కలుపుకుని 17 మంది హాజరయ్యారు. ముఖ్యంగా ఉపసర్పంచ్ బరిలో వైఎస్సార్ సీపీ వార్డు సభ్యుల మద్దతుతో పోటీలో ఉన్న 11వ వార్డు సభ్యుడు కత్తుల శ్రీనివాస్ గైర్హాజరవ్వడంతో మరో వార్డు సభ్యుడు మెండె సుధాకర్ తాను పోటీకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. సుధాకర్‌కు మరో వార్డు సభ్యురాలు లక్ష్మి బలపరచగా, ధ్రువీకరించేందుకు వార్డు సభ్యులు ముందుకు రాకపోవడంతో కూటమి మద్దతు అభ్యర్థి అద్దెపల్లి సాంబశివనాగరాజును ఉపసర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏకగ్రీవానికి ముందే వార్డు సభ్యులు మేకల నాగేశ్వరరావు తాను ఎన్నికలను బహిష్కరిస్తున్నానంటూ వెళ్లిపోయారు. ఉపసర్పంచ్ స్థానం చేజిక్కించుకునేందుకు టీడీపీ నాయకులు వార్డు సభ్యులను బెదిరించడం, ప్రలోభాలకు గురి చేయడం వంటి చర్యలకు పూనుకున్నారు. వైఎస్సార్ సీపీ మద్దతుతో మెజార్టీ వార్డు సభ్యులను కూడగట్టుకున్న 11వ వార్డు సభ్యుడు కత్తుల శ్రీనివాస్‌తో పాటు పలువురు వార్డు సభ్యులను బెదిరించడం వల్లే ఎన్నికకు హాజరు కాలేదని పలువురు చెబుతున్నారు. కత్తుల శ్రీనివాస్ ప్లాటుకు విద్యుత్ ఫ్యూజులు తీయడం, గతంలో నిర్మించిన కట్టడానికి నోటీసులు ఇవ్వడం వంటి చర్యలకు పాల్పడ్డారు. మిగిలిన వైఎస్సార్ సీపీ వార్డు సభ్యులకు పోలీసులు, టీడీపీ నాయకులు ఫోన్లు చేసి బెదిరించారని పలువురు సభ్యులు తెలిపారు. బెదిరింపులు, ప్రలోభాలకు గురి చేసి ఉపసర్పంచ్ స్థానాన్ని కూటమి నాయకులు చేజిక్కించుకున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

కేసరపల్లి, అల్లాపురం ఉపసర్పంచులు ఏకగ్రీవం

గన్నవరం: మండలంలోని కేసరపల్లి, అల్లాపురం ఉపసర్పంచ్ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. కేసరపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రిసైడింగ్ అధికారి టి. భారతి నేతృత్వంలో ఎన్నికల ప్రక్రియను ప్రారంభించారు. ఉపసర్పంచ్ పదవికి ఒకటో వార్డు సభ్యులు జాస్తి శ్రీధర్ బాబు పేరును పాలకవర్గ సభ్యులందరూ ప్రతిపాదించారు. దీంతో శ్రీధర్‌బాబును ఏకగ్రీవంగా ఎన్నికైనట్లుగా ప్రిసైడింగ్ అధికారి ప్రకటించారు. అనంతరం ఆయనకు ధ్రువీకరణ పత్రం అందజేయడంతో పాటు ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన ఉపసర్పంచ్ శ్రీధర్‌బాబును ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు, సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీ మౌనిక, నీటి సంఘం అధ్యక్షులు జాస్తి విజయభూషణ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు శొంఠి కిషోర్, గ్రామ ప్రముఖులు రాజులపాటి శ్రీనివాసరావు, మరీదు రాంబాబు, పాలకవర్గ సభ్యులు సత్కారించారు. అల్లాపురం ఉపసర్పంచ్‌గా మూడవ వార్డు సభ్యులు గుండాల అచ్చియ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం అచ్చియ్యను సర్పంచ్ డొక్కు సాంబశివవెంకన్నబాబు సన్మానించారు.

పెద్ద అవుటపల్లి గ్రామ ఉప సర్పంచ్‌గా ఉషారాణి...

ఉంగుటూరు: మండలంలోని పెద్ద అవుటపల్లి గ్రామ పంచాయితీ ఉప సర్పంచ్‌గా 8వ వార్డు సభ్యురాలు మరీదు ఉషారాణి ఏకాగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రత్యేక అధికారి జేవీఎస్ఆర్‌కే ప్రసాద్ తెలిపారు. స్థానిక గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఉప సర్పంచ్ ఎన్నిక గురువారం నిర్వహించారు. పంచాయతీలో 14మంది వార్డు సభ్యులు ఉండగా కూటమి పార్టీ బలపరచిన మరీదు ఉషారాణికి 10 మంది సభ్యులు మద్దతు తెలపడంతో ప్రత్యర్థిగా ఎవరు నిలబడకపోడవంతో ఏకాగ్రీవంగా ఎన్నికైంది. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ సూర్యప్రకాష్, కార్యదర్శి జే.యోహాను పాల్గొన్నారు.

టెక్నికల్ ఫెస్ట్‌తో విద్యార్థులకు ప్రయోజనం



ఫెస్ట్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ దేవకుమార్ జ్యోతి

నున్న(విజయవాడరూరల్): ఇంజినీరింగ్ విద్యార్థులకు టెక్నికల్ ఫెస్టివల్స్‌ను నిర్వహించడం వలన సాంకేతిక పరమైన పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ చైర్మన్, కమ్యూనిటీ ఎడ్యుకేషన్ సెక్రటరీ ఆచార్య దేవ కుమార్ జ్యోతి తెలిపారు. నున్న గ్రామం వికాస్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగే వికాస్ వికసిత్ 2К25 ఫెస్ట్‌ను ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవ కుమార్ జ్యోతి మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులు సాంకేతిక పరంగా తమ సామర్థ్యాలను నిరూపించుకోవడానికి ఇది ఒక వేదికగా దోహదం చేస్తుందని చెప్పారు. వివిధ కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేసి నైపుణ్యాలను ప్రదరించాలని సూచించారు. విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరమైన టెక్నికల్ ఫెస్టివల్స్‌ను నిర్వహించడం అభినందనీయమని కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు. కళాశాల చైర్మన్ ఎన్.నర్సిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యాలు వెలుగులోకి తీసుకొచ్చేందుకు ప్రతి ఏడాది ఫెస్ట్‌లను నిర్వహిస్తామన్నారు. ప్రిన్సిపాల్ సీహెచ్ పరమేశ్వరరావు, అకడమిక్ డైరెక్టర్ ఎస్.కీర్తి రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాపుల రక్షణ కోసమే శిలువ ఎక్కిన ఏసుక్రీస్తు



గన్నవరం రూరల్: మండలంలోని చిక్కవరం ఆర్‌సీఎం దేవాలయం నుంచి గురువారం పవిత్ర శిలువ మార్గాన్ని ఆచరించారు. కొండపావులూరు విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ తోకల సురేష్ పర్యవేక్షణలో క్రైస్తవులు పలు ప్రధాన సెంటర్‌లు, కూడళ్ల వద్ద ప్రభువు అయిన ఏసుక్రీస్తు శ్రమదినాల్లో అనుభవించిన పలు ఘట్టాలను స్మరించుకుంటూ, 14 స్థలాల వద్ద క్రైస్తవ భక్తి గీతాలు ఆలపిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెవరెండ్ ఫాదర్ సురేష్ ప్రసంగిస్తూ పాపుల రక్షణ కోసం ఏసుక్రీస్తు శిలువ ఎక్కారని చెప్పారు. మానవాళి పాపాల నుంచి విముక్తిని ప్రసాదించేందుకు ఏసుక్రీస్తు ఈ లోకానికి వచ్చారని చెప్పారు. క్రీస్తు పడిన శ్రమలను వివరించారు. ఉపదేశి దోమతోటి పవన్‌కుమార్, సంఘ పెద్దలు తంగెళ్లమూడి అచ్చయ్య, నువ్వుల సురేష్, లోకేష్, డాన్‌బాస్కో యూత్, మరియదళం సభ్యులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

పెనమలూరు: పెనమలూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలు అవ్వటంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోరంకి నారాయణపురం కాలనీ ప్రాంతానికి చెందిన చిలకలపల్లి గురుమూర్తి (57) పెనమలూరు వంతెన వద్ద నడుచుకుంటూ వెళుతుండగా గుర్తు తెలియని బైక్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆయన రోడ్డు పై పడిపోయాడు. ఈ ప్రమాదంలో కుడికాలు, కుడి చేతికి గాయాలయ్యాయి. వైద్య చికిత్సకై బాధితుడిని విజయవాడ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: పోరంకి సెక్షన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు శుక్రవారం అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. రామాపురం కాలనీ ఫీడర్ మరమ్మతులు కారణంగా ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. దీని కారణంగా సాలిపేట, రామాపురంకాలనీ, పెనమలూరు సెంటర్, బందరు రోడ్డు, డొంకరోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. స్థానికులు సహకరించాలని కోరారు.

ప్రవీణ్ కేసులో వాస్తవాలు నిగ్గు తేల్చాలి



హనుమాన్‌జంక్షన్ కూడలిలో ఆందోళన నిర్వహిస్తున్న పాస్టర్లు

హనుమాన్‌జంక్షన్ రూరల్: అనుమానాస్పదంగా మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాల కేసులో నిస్పక్షపాతంగా విచారణ జరిగి వాస్తవాలను నిగ్గు తేల్చాలని జంక్షన్ క్రిస్టియన్ ఫెలోషిప్ (జేసీఎఫ్) గౌరవ అధ్యక్షులు బిషప్ రత్నబాబు, అధ్యక్షులు రత్నభూషణ్, ఉపాధ్యక్షులు పేతురు, కార్యదర్శి శుభాకర్ డిమాండ్ చేశారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పదంగా మృతి ఘటనపై గురువారం హనుమాన్‌జంక్షన్ ప్రధాన కూడలిలో నిరసర ప్రదర్శన నిర్వహించారు. 'మానవత్వం ముద్దు.. మతోన్మాదం వద్దు' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఇటీవల క్రైస్తవులు, దైవ సేవకులపై వరుసగా దాడుల జరుగుతున్నారని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. క్రైస్తవ్యాన్ని చిన్నచూపు చూస్తూ, దూర్భాషలాడుతున్న ఘటనలు కోకొల్లలుగా జరుగుతున్నాయని వాపోయారు. వీటిపై కూటమి ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనల్లో నిందితులకు కఠిన శిక్ష విధించాలని, భవిష్యత్‌లో ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. పాస్టర్లు కిరణ్ పాల్, అబ్రహం, పుష్పరాజ్ పాల్గొన్నారు.

నోటి శుభ్రతతో వ్యాధులు దూరం



కంకిపాడు: నోటి శుభ్రతతో వ్యాధులు దరిచేరవని కంకిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం డెంటల్ సర్జన్ డాక్టర్ సి.దుర్వాసులు తెలిపారు. జాతీయ ఓరల్ హెల్త్ డే కార్యక్రమం గురువారం కంకిపాడులో నిర్వహించారు. సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద నుంచి ప్రధాన సెంటరు వరకూ వైద్య ఆరోగ్య సిబ్బంది అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య కేంద్రం సమీపంలోని ఓ పాఠశాలలో విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు చేసి నోటి శుభ్రత చర్యలపై అవగాహన కల్పించారు. డాక్టర్ దుర్వాసులు మాట్లాడుతూ నోటిని ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దంత శుభ్రతపై జాగ్రత్తలు అవసరమన్నారు. కార్యక్రమం ఏప్రిల్ 10వరకూ సాగుతుందని వివరించారు. డాక్టర్ దుర్గాదేవి, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ సంజయ్, ఎన్‌సిడి అసిస్టెంట్ విజయ్ పాల్గొన్నారు.

తెలుగు ఉగాది క్యాలెండర్ ఆవిష్కరణ



కాలెండర్‌ను అవిష్కరిస్తున్న ఎంపీడీఓ, సీడీపీఓ, సేవాసమితి సభ్యులు

గన్నవరం: స్థానిక మండల పరిషత్ ఆవరణలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో గురువారం త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో తెలుగు ఉగాది క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. తొలుత ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీడీఓ టి. స్వర్ణలత కాలెండర్ ఆవిష్కరించి అందరికీ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తెలుగు నెలలను అనుసరించడానికి వీలుగా తెలుగు తిథులతో ఆంగ్ల తేదీలు పొందుపరిచి తయారుచేసిన కాలసూచిక అందరికీ ఉపయుక్తంగా ఉంటుందన్నారు. సేవా సమితి సభ్యులు రుద్రు తిరుపతిరావు మాట్లాడుతూ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన జ్ఞాన తెలుగు కాలసూచిక ఎన్నో భగవద్గీత వచనాలను జోడించి ప్రతిఒక్కరికీ అర్థమయ్యే విధంగా రూపొందించినట్లు తెలిపారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ పి. వెంకటలక్ష్మి, సహాయ సాంఘిక సంక్షేమ అధికారి డి. రాంబాబు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు చిమట రామారావు, గ్రంథాలయ ఇన్‌ఛార్జ్ పీడీ లక్ష్మీ, సేవా సమితికి చెందిన జగీరపు సురేష్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించాలని ఆందోళన

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం బండారుగూడెంలో రక్షిత తాగునీటి సరఫరా సక్రమంగా లేకపోవటంతో మహిళలు గురువారం ఆందోళన నిర్వహించారు. గత కొద్ది రోజులుగా పంచాయతీ వాటర్ రావటం లేదని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మహిళలు వాపోయారు. పంచాయతీ అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే తాగునీటి సమస్యను పరిష్కరించకపోతే నిరవధిక ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సీపీఎం నాయకులు బర్రె లెనిన్, వీరంకి రామారావు, పామర్తి ప్రభు ఆందోళన చేస్తున్న మహిళలకు మద్దతు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రహరీలు నిర్మించాలి



గన్నవరం రూరల్: అంగన్‌వాడీ బాలల రక్షణ కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి అధికారులను కోరారు. మండలంలోని మాదలవారిగూడెం, తెంపల్లి గ్రామాల్లో గురువారం ఆమె అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎలిజబెత్‌రాణి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రహరీలు నిర్మించేందుకు జిల్లా పరిషత్ నుంచి నిధులు మంజూరు చేయాలని ఇప్పటికే కోరినట్లు చెప్పారు. కేంద్రాలను సందర్శించి సమస్యలు తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళుతున్నట్లు చెప్పారు. నివేదిక రూపొందించి జిల్లా పరిషత్‌కు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. తెంపల్లి సర్పంచ్ కొలుసు శిరీషా, సీడీపీవో వెంకట లక్ష్మీ, సీనియర్ సూపర్‌వైజర్ పద్మావతి, సూపర్‌వైజర్ సత్యవాణి, పంచాయతీ కార్యదర్శులు రాజేష్, రాజశేఖర్, అంగన్‌వాడీ టీచర్‌లు పాల్గొన్నారు.

ప్రకటన

[illegible]